క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలో లైన్ షిఫ్ట్, రోడ్డు విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాంనగర్ ఫీడర్, మిర్యాలగూడ రోడ్, బీటీఎస్, శామ్సనగర్, భారత్ గ్యాస్ ఏరియా, దారుపాష కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్

శాలిగౌరారం: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మెటరాలజి అధికారి శ్రీనివాస్ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన వెంకట్‌రెడ్డి మృతికి సంతాపం

నల్లగొండ టౌన్: పట్టణానికి చెందిన విద్యావేత్త చిన వెంకట్‌రెడ్డి మృతికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టౌన్: ప్రభుత్వ వికలాంగుల వసతి గృహ హాస్టల్ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలో ప్రవీణ్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ప్రభుత్వ బాలుర సదనం హైదరాబాద్, నల్లగొండ ప్రభుత్వ బాలుర వికలాంగుల కళాశాల వసతి గృహ విద్యార్థులు కలిపి రూ.52,000 నగదును మృతుడు ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంతాప సభలో అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహాల హాస్టల్ వార్డెన్లు వెంకట్‌రెడ్డి డీడబ్ల్యూఓ ఆఫీస్ సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు సతీష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శంకర్, సైదులు, స్వామి నాగయ్య, నాగరాజు, యాదగిరి, నరేష్, కేశవ్, సురేష్, సింహాద్రి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా చికిలంమెట్ల సైదులు(తాళ్ళవెల్లెంల), కామాటి సురేష్(గుండ్రాంపల్లి), మునుగోటి లింగయ్య(చిన్నకాపర్తి), చికిలంమెట్ల సత్తయ్య(చిట్యాల), ప్రధాన కార్యదర్శులుగా చిట్యాల పాండు(వెలిమినేడు), వేముల రమేష్(ఉరుమడ్ల), కార్యదర్శులుగా చికిలంమెట్ల లింగస్వామి(ఏపూరు), గడిగల శేఖర్(ఎలికట్టె), అక్కెనపల్లి నాగరాజు(వనిపాకల), కోశాధికారిగా శివలింగం(ఏపూరు)లతో పాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయినట్లు పేర్కొన్నారు.

ఫొటో జర్నలిస్టులకు సన్మానం

నల్లగొండ టూటౌన్: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టులను బుధవారం నల్లగొండ ప్రెస్ క్లబ్, యూనియన్ల ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డు పొందిన సాక్షి స్టాఫ్ ఫొటో జర్నలిస్టు కంది భజరంగ్ ప్రసాద్, ఇతర ఫొటోగ్రాఫర్లు విజయ్, శ్రీనివాస్, కె.శ్రీనివాస్, వెంకన్న, నరేందర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే 143 జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పులిమామిడి మహేందర్‌రెడ్డి, గాదె రమేష్, దండంపల్లి రవికుమార్, శేషరాజుపల్లి వీరస్వామి, సల్వాది జానయ్య, ఉబ్బని సైదులు, నీలకంఠం మధు, కత్తుల యశ్వంత్, యాదగిరి పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం సర్వే

నల్లగొండ టౌన్: పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిదో వార్డు వెంకటరమణ కాలనీకి వెళ్లి సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు.

ముస్లిం మతపెద్ద మృతి

నకిరేకల్ : పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన ముస్లిం మత పెద్ద అక్బర్ మౌలానా(48) గుండెపోటుతో కన్నుమూశారు. మంగళవారం మౌలానా గుండెకు సంబంధించిన సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాడు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి కన్నుమూశారు. అక్బర్ మౌలానా 25ఏళ్లుగా స్థానిక మసీదులో ఇమామ్-ఖతీబ్ మత పెద్దగా వ్యవహరిస్తూ అల్లాహ్‌దీన్ సేవలో గడిపారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్బర్ మౌలానా మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత సందర్శించి నివాళులర్పించారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో మూసీ ప్రాజెక్టుకు వరదనీటి రాక కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్టు ఎనిమిది క్రస్టు గేట్లను రెండు అడుగులు పైకెత్తి దిగువకు 9,385 క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 117 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కాల్వలు పారలే.. చెరువులు నిండలే


నీరు లేక వెలవెలబోతున్న ఎల్లగూడెం ఎర్రకుంట


మునుగోడు పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యామ్

- ఈ ఏడాది మునుగోడులో కురవని భారీ వర్షాలు
- పెరగని భూగర్భ జలాలు
- బోర్లు పోయక రైతుల అవస్థలు

మునుగోడు: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చి చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. కానీ మునుగోడు మండలంలో మాత్రం అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురిసినా ఏఒక్క రోజు కూడా మునుగోడు మండలంలోని ఒక్క కాల్వ, వాగు పారలేదు. దీంతో గత ఏడాది ఎండిపోయిన చెరువులు చుక్క నీరు లేక వెలవెల బోతున్నాయి. గతంలో జూలై మొదటివారంలో కనీసం సగం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు వచ్చి చేరేవి.

4.9 సెంటీమీటర్లకు మించి కురవని వర్షం..

ఈ ఏడాది మండలంలో 4.9 సెంటీమీటర్లకు మంచి వర్షం కురవలేదు. జూలై 17వ తేదీ నుంచి దాదాపు 9 రోజుల పాటు వర్షం కురిసింది. మొదటి రోజు కేవలం 1.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. మిగిలిన రోజుల్లో 2 సెంటీమీటర్ల లోపు వర్షపాతం నమోదయింది. ఆగస్టు 12వ తేదీన మాత్రం 4.9 సెంటీమీర్ల వర్షపాతం నమోదయింది. ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అడపాదడపా వర్షం కురిసింది. కానీ రెండు, మూడు సెంటీమీటర్లు మాత్రమే కురవడంతో ఏ గ్రామంలో కూడా కాల్వలు పారలేదు. భూగర్భ జలాలు పెరగకపోవడంతో బోర్లు పోయక వరి పంటలు సాగుచేసిన రైతులకు తీవ్రనష్టం వాటిల్లనుందని పలువురు రైతులు వాపోతున్నారు.

మండల వ్యాప్తంగా 112 చెరువులు..

మునుగోడు మండలంలోని 29 గ్రామాల్లో 112 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 10 చెరువులు పెద్దవి కాగా.. 102 చెరువులు చిన్నవి. గత ఏడాది కూడా భారీ వర్షాలు కురవకపోవడంతో వేసవిలో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. ప్రధానంగా పెద్ద చెరువులైన మునుగోడు, సోలిపురం, చీకటిమామిడి, తదితర చెరువుల్లో చుక్క నీరు కనిపించడం లేదు. కిష్టాపురం పెద్ద చెరువులో కొన్ని నీళ్లు వచ్చి చేరాయి. పులిపలుపుల, కొంపల్లి, కొరటికల్, కల్వలపల్లి తదితర గ్రామాల్లోని పెద్ద చెరువుల్లో కొద్దిపాటి నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాది నేటికీ చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

చెరువులు, కుంటలు నిండలేదు

మునుగోడు మండలంలోని కిష్టాపురం చెరువులోకి మాత్రమే కొద్దిపాటి నీళ్లు వచ్చి చేరాయి. మిగిలిన ఏ ఒక్క చెరువులోకి ఈ ఏడాది వర్షపు నీరు రాలేదు. భారీ వర్షాలు కురవని కారణంగా ఎక్కడా కాల్వలు, వాగు పారలేదు.

– ప్రేమ్‌కుమార్, ఐబీ డీఈ

ప్రతి జూన్‌లో మా చెరువు నిండేది



మా గ్రామంలోని ఎర్రకుంట ప్రతి ఏటా జూన్ మాసంలోనే నిండేది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు గుంతల్లోకి కూడా నీరు రాలేదు. ఒక్క భారీ వర్షం కురిసినా పెద్ద వాగు పారి పలివెల ఫీడర్ చానల్ ద్వారా మా చెరువులోకి నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది వాగు పారలేదు.

– మేకల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లగూడెం

కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ : మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో కుక్కలకు నూరు శాతం వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ మున్సిపాలిటీలో మాత్రమే ఎనిమల్ బర్త్ కంట్రోల్ విభాగం ఉందని, ఇతర మున్సిపాలిటీల్లో కూడా ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కుక్క కాటు కోసం హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ , జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రవి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్యాడీ క్లీనర్ ద్వారా ధాన్యం శుభ్రం చేయాలి

తిప్పర్తి : వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులు తెచ్చే ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్ల ద్వారా శుభ్రపరుచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం శుభ్రపరిచే యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం శుభ్రపరిచే ఆటోమెటిక్ యంత్రాలను కూడా కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. యూరియా కొరత దృష్టిలో ఉంచుకుని ఎవరు కూడా ఎక్కువ మొత్తంలో యూరియా నిల్వ ఉంచరాదన్నారు. మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు, రైతులు సహకరించి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీఏ ఛాయాదేవి, డీఎస్ఓ వెంకటేశం , డీఎం హరీష్, మార్కెట్ సెక్రటరీ శ్రీనాథరాజు, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ జానయ్య పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


నకిరేకల్ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం


నల్లగొండ: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, పాశం సురేందర్‌రెడ్డి, వెన్‌రెడ్డి రాజు, దోటి వెంకన్న, మేకల ప్రమోద్‌రెడ్డి, దండు యాదగిరిరెడ్డి, సత్తి, భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

నల్లగొండ: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, అశోక్, సుందర్, కత్తుల కోటి, జూలకంటి శ్రీని వా స్, మందడి శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ శంకర్, ఎండీ ఇంతియాజ్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, కంచర్లకుంట్ల వెంకటరెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్ : రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం నకిరేకల్ పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి : రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, వనపర్తి శ్రీరాములు, కిన్నెర అంజి పాల్గొన్నారు.

మర్రిగూడ : రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మర్రిగూడలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాస శేఖర్, జంగిలి రవి, వెంకటంపేట బాలయ్య, కొడాల అల్వాల్‌రెడ్డి, మాతంగి నవీన్, లింగారెడ్డి, మల్లేష్, మాస చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే మందుల సామేల్


చెరువును పరిశీలిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: చెరువు భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆక్రమణకు గురైన మండలంలోని మాధారంకలాన్ గ్రామానికి చెందిన నీలసముద్రం చెరువును బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. చెరువు సమీపంలోని పెర్కకొండారం రైతులకు సంబంధించిన 50 ఎకరాల వ్యవసాయ భూమిని ఖమ్మం జిల్లాలో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు 2017లో కొనుగోలు చేసి, గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండదండలతో సుమారు 10 ఎకరాల చెరువు శిఖంను ఆక్రమించడంతోపాటూ అక్రమంగా పట్టా పొంది చేపల చెరువులు నిర్మించారన్నారు. రైతులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 672 చెరువులు, కుంటలు ఉన్నాయని, ప్రతి చెరువు, కుంట శిఖం భూముల నివేదికలు తీసుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలోనే కాకుండా బఫర్ జోన్‌లో ఉన్న భూములను సైతం స్వాధీన పరుచుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట నీటిపారుదల శాఖ తిరుమలగిరి డివిజన్ ఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ జమీరుద్దీన్, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈలు విక్రమ్, హరి, డీసీసీ నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఎర్ర చైతన్య తదితరులు ఉన్నారు.

‘రైతులకు యూరియా అందించకపోవడం సిగ్గుచేటు’

రామగిరి(నల్లగొండ): జిల్లాలో రైతాంగానికి అవసరమైన యూరియాను సరిపడా అందించలేకపోవడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అన్నారు. నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, పార్టీ నల్లగొండ మండల అధ్యక్షులు నరవరా సైదులు, మండల కమిటీ సభ్యులు కొండా వెంకన్న, ఎల్లయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాల పంపిణీ

చిట్యాల: ఏపూరు గ్రామానికి చెందిన గుమ్మి రవీందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి పాలెం మల్లేష్‌గౌడ్, కొండె శ్రీశైలం, పానుగుళ్ళ రాములు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు గతంలో బ్యాంకులో నగదు డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ ద్వారా వచ్చిన వడ్డీ రూ.పదివేలను ఈ ఏడాది ఏపూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఉప్పల అజయ్‌కు రూ.3500, వలిగొండ గాయత్రికి రూ.2500 అందజేశారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు హాజరు శాతంతోపాటు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.500 చొప్పున ఎనిమిది మందికి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నబీహా, దాత గుమ్మి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశం మార్నింగ్ వాక్


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : పట్టణంలోని మెయిన్ రోడ్డు వెంట బుధవారం ఉదయం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మార్నింగ్ వాక్ చేశారు. తనకు ఎదురుపడిన ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట చౌగోని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

22న గ్రామాల్లో పనుల జాతర

నల్లగొండ : గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ నెల 22న పనుల జాతర నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కింద వ్యక్తిగత లబ్ధిదారులకు చెందిన కనీసం ఒక పనిని 22న శంకుస్థాపన చేయాల్సి ఉంటుదని తెలిపారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న నల్లగొండ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు

రామగిరి (నల్లగొండ): గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని నల్లగొండ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, రూరల్ ఎస్ఐ సైదాబాబు అన్నారు. బుధవారం నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. గణేశ్ నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతులు లేవన్నారు.

మర్రిగూడ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసుశాఖ అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు.

డాక్టరేట్ అందుకున్న చిట్యాల మండలవాసులు

చిట్యాల: పట్టణానికి చెందిన ఉండ్రాతి దశరథ భౌతిక శాస్త్రం విభాగంలో చేసిన పరిశోధనకుగాను ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 84వ కాన్వకేషన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. అదేవిధంగా చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా ప్రవీణ్‌రెడ్డి తెలుగు భాషలో చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకున్నారు.

శ్రమదానంతో గండి పూడ్చివేత

నార్కట్‌పల్లి: మండలంలోని నక్కలపల్లి-తొండ్లవాయి గ్రామాల మధ్య బీటీ రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు తెగిపోయింది. బుధవారం నక్కలపల్లి గ్రామస్తులు, యువకులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి నక్కలపల్లి-తొండ్లవాయి రహదారిలో తాటిమొద్దులు, రాళ్లతో గండిని పూడ్చి రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో బాషపాక రవికుమార్, చిల్ల భిక్షం, శ్రీపతి చరణ్, చిలుకూరి బన్ని, బాషపాక గణేశ్, శివగణేశ్ పాల్గొన్నారు.

నాంపల్లి వాసికి నేషనల్ యూనిట్ అవార్డు

నాంపల్లి: అంతర్జాతీయ యువజన దినోత్సవం ముగింపు కార్యక్రమం సందర్భంగా నాంపల్లికి చెందిన ఈద భాస్కర్‌కు నేషనల్ యూనిట్ అవార్డు లభించింది. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో భాస్కర్ అవార్డు అందుకున్నారు. భాస్కర్ నల్లగొండలోని చైల్డ్ వెల్ఫేర్(మేజిస్ట్రేట్)లో పని చేస్తున్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

మర్రిగూడ: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే వృద్ధురాలు మృతిచెందిందని ఆమె బంధువులు బుధవారం ఆస్పత్రిఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు.. మర్రిగూడ మండలం రాజాపేటతండాకు చెందిన జింకల సత్తమ్మ(68) మంగళవారం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం సత్తమ్మ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే సత్తమ్మ మృతిచెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. స్థానిక ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి ఆస్పత్రికి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. వృద్ధురాలికి మెరుగైన వైద్యం అందించినప్పటికీ గుండెపోటు కారణంగా మృతిచెందిందని ఆస్పత్రి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శంకర్‌నాయక్ తెలిపారు.

బీసీల సంక్షేమానికి రామరాజు కృషి ప్రశంసనీయం

నల్లగొండ టౌన్: బీసీల సంక్షేమానికి చక్రహరి రామరాజు చేస్తున్న కృషి ప్రశంసనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు జన్మదినం సందర్భంగా బుధవారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రామరాజు దంపతులను ఘనంగా సన్మానించారు. కుందారపు గణేశాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగిని మురళి, రవినాయక్, విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, కంది సూర్యనారాయణ, నల్ల సోమమల్లయ్యలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల సాధన సదస్సును జయప్రదం చేయాలి

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో ఈ నెల 22న రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాచకొండ ఎత్తిపోతల పతకం సాధన సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసాచారి కోరారు. బుధవారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కడీలబాయితండా, రాచకొండ, తుంబాయి తండా, రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని తిప్పాయిగూడెం, చౌటుప్పల్ మండలంలో అల్లాపురం, పీపల్‌పహాడ్, నాగారం, తంగడపల్లి గ్రామాల్లో ప్రచారజాత నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దోనూరి నర్సిరెడ్డి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, యాదయ్య, జంగయ్య, నర్సింహ, గాలయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు


చిట్యాల: వెలిమినేడు విజయవాణి విద్యానికేతన్‌లో బోనాలు, పోతురాజు వేషధారణలో విద్యార్థులు


చండూరు : బంగారిగడ్డలో..


మునుగోడు : గంగోరిగూడెంలో...

చిట్యాల: వెలిమినేడులో గల విజయవాణి విద్యానికేతన్, ఉరుమడ్ల గ్రామంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారం బోనాల పండుగ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పోతరాజుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో వెలిమినేడు విజయవాణి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ వలిగొండ శంకర్, కరస్పాండెంట్ అర్రూరి రాజు, గుత్తా మహేందర్‌రెడ్డి, ఉరుమడ్ల ప్రగతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గుత్తా మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పంతంగి నర్సింహ, ఉపాధ్యాయులు స్వరూప, సంగీత, సుజాత, ప్రవంతి, ఇందిర, సుజాత, కవిత, స్వాతి, పట్ల జనార్దన్, ఉయ్యాల శేఖర్ పాల్గొన్నారు.

మునుగోడు: గంగోరిగూడెం, మునుగోడు గ్రామాల్లో ప్రజలు ముత్యాలమ్మ బోనాల పండుగ జరుపుకున్నారు. వేడుకల్లో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చండూరు : మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ బోనాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోతురాజుల నృత్యాల నడుమ కోలాహలంగా ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు.

సంక్షిప్త సమాచారం

బహుమతులు అందజేత

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్షపల్లి ప్రభుత్వ పాఠశాలలో బేతల్ గాస్పల చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మైలారపు గిరీష్ పార్వతమ్మ, సీపీఐ గ్రామ కార్యదర్శి మేతరి యాదయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

తిప్పర్తి : రాజుపేట ఉన్నత పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్టార్స్ ఆధ్వర్యంలో పాఠశాలకు మైక్‌సెట్, ఇద్దరు విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీల, లయన్స్ క్లబ్ స్టార్ అధ్యక్షుడు బండ నర్సిరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

శాలిగౌరారం: వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

కేతేపల్లి: గురుకులాలను బలోపేతం చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని మూసీ బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వంటిపాక సుధాకర్ అన్నారు. మూసీ ప్రాజెక్టు వద్ద గల మహాత్మా జ్యోతిబా బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, బండారు ప్రసాద్, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను బుధవారం నల్లగొండలో ఆవిష్కరించి మాట్లాడారు.

నకిరేకల్ : సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నా ప్రచార పోస్టర్‌ను పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎంఈఓ మేక నాగయ్య విడుదల చేశారు. సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్‌బాబు, హెచ్‌ఎం రాములు, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

23న హైదరాబాద్‌లో ధర్నా

నల్లగొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం స్టీరింగ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ వెంకట్, ఎం.సోమయ్య తెలిపారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం వారు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు శ్రీరాములు, హరికిషన్, యం.రాజశేఖర్ రెడ్డి, పెరుమాళ్ళ వెంకటేశం, నర్రా శేఖర్ రెడ్డి, బి. వెంకటేశం, పి.వెంకులు, ఏడుకొండలు, నలపరాజు వెంకన్న, జగతి, పి.రాజశేఖర్, లక్ష్మీనారాయణ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

శాలిగౌరారం: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం స్థానిక పీఏసీఎస్‌లో ఎరువుల గోదాంను సందర్శించి ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ నాగరాణి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందికి అభినందన

నల్లగొండ టూటౌన్: ఎంజీయూలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో సహాయ ఆచార్యులు డి.సంధ్యారాణి, యం. జయంతి ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా బుధవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని వీసీ కాజా అల్తాఫ్ హుస్సేన్ అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

శాలిగౌరారం: ఇటీవల రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన మండల కేంద్రానికి చెందిన బండారు మహేశ్ కుటుంబానికి తెలంగాణ హైదరాబాద్‌లోని పవన్‌సాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ యజమాని ఆలేటి శ్రీనివాసులు బుధవారం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మహేశ్ కుమారుల విద్యాఖర్చులు భరించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మహేశ్ కుటుంబానికి అతడితోపాటు 2011-12 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన స్నేహితులు రూ.12500 అందజేశారు. శాలిగౌరారం గౌడసంఘం అధ్యక్షుడు కుంభం నర్సింహ రూ.10 వేలు అందజేశారు.